పేదల గుండెల్లో వైఎస్సార్ పదిలం

- ఘనంగా జయంతి
- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు


నేరడిగొండ: వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయికిగా నిలిచారని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కార్యకర్తలతో కలిసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెట్టిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆడె వసంత్‌రావు, అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, మౌలాన, పాల శంకర్, సయ్యద్ ఇసాఖొద్దీన్, కుంట శంకర్, రాంలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుర్మె మహేందర్, ఇట్టెడి రాజరెడ్డి, భోజన్న, అబూద్, మహమూద్, గూడూరు వంశీరెడ్డి, అబ్రార్, శేఖర్, గంగారాం, రహీమొద్దిన్, షాకీర్ ఉన్నారు.


బోథ్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


బేలలో..

బేల: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, బేల సహకార సంఘం మాజీ చైర్మన్ మినక సుధాంరెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, సామ రూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: పూలమాలలు వేస్తున్న నాయకులు

జైనథ్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలించిన ఆయన ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ప్రజల మన్ననలు పొందారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడిచర్ల లస్మన్న, గడ్డం జగదీశ్ రెడ్డి, అల్లూరి అశోక్ రెడ్డి, పిడిగు స్వామి యాదవ్, సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: దివంగత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను సోమవారం మండలకేంద్రంలో నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధిని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మీర్జా యాకుబ్‌బేగ్, మెస్రం నాగ్‌నాథ్, సోమసే వెంకట్‌రావ్, పవార్ దుదిరాంనాయక్, సోమసే వెంకట్‌రావ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: జననేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజుయాదవ్, బత్తుల అశోక్‌లు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ లాంటి మహానాయకుడు ఇప్పటికీ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయి ఉన్నాడని గుర్తు చేశారు.


జైనథ్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మావల మండలంలోని కేఆర్కే కాలనీలో గల వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ నాయకులు వృద్ధులతో కలిసి కేక్‌కట్ చేశారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ధర్మపురి చంద్రశేఖర్, దామోదర్ రెడ్డి, నవీన్ రెడ్డి, నాగరాజు, రంజిత్ రెడ్డి, కుర్ర నరేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

ఇచ్చోడ: ప్రతీ రైతు తమ పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో మనీషాగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని చించోలిలో పంట పొలాలను సందర్శించారు. వివరాలు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పంటల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా రానున్న రోజుల్లో రైతులు పండించిన పత్తి, సోయా పంటలు విక్రయించుకునేందుకు ఇలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి పూజిత అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాగూడ, లింగూడ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు ఇచ్చే సూచనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం పద్మ, సముద్ర, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఇచ్చోడ: ప్రైవేట్ పాఠశాలల ఫీజులు దోపిడీని అరికట్టాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ కొట్టూరి ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్కూల్ యూనిఫాంలు, బుక్స్, టై పాఠశాలలోనే విక్రయిస్తున్నారన్నారు. విద్యశాఖ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్, కోకన్వీనర్ సతీష్, సాయి గణేష్, పవర్ సురేశ్, కార్తీక్ పాల్గొన్నారు.

కస్తూరిబా వసతి గృహం తనిఖీ


సరుకులు పరిశీలిస్తున్న నయబ్ తహసీల్దార్

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల వసతి గృహన్ని సోమవారం పౌరసరఫరాల శాఖ నయబ్ తహసీల్దార్ శ్యాంసుందర్ తనిఖీ చేశారు. స్టోర్‌రూం, వంట గదిని పరిశీలించారు. వర్షాకాలం వంట గది పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిత్యవసర సరుకులపై ఈగలు, దోమలు వాలకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మస్కే రీతా, లక్ష్మి, నీలవేణి, సంగీత, హృదయ పాల్గొన్నారు.

'వనమహోత్సవం'లో భాగస్వాములు కావాలి

ఇచ్చోడ: వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని కోకస్‌మన్నూర్‌లో కెనాల్ గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలని సూచించారు. మొక్కలు నాటి పర్యావరణం కాపాడుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

బస్సు ప్రయాణం సురక్షితం


అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

సిరికొండ: ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమని ఆర్టీసీ సెఫ్టీ ఆఫీసర్ విష్ణు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నార్నూర్‌లో భారీ వర్షం


తహసీల్దార్ కార్యాలయంలోకి చేరిన వరదనీరు

నార్నూర్: మండలంలో సోమవారం భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. రోడ్డుపై నుంచి భారీగా వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మండల కేంద్రంలో తహసీల్దార్, ఐకేపీ కార్యాలయంలో భారీగా వర్షపు నీరు చేరడంతో గదులన్ని వరద నీటితో నిండిపోయింది. భారీ వర్షం కురవడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకరమైన వాగులు, కల్వర్టులు దాటవద్దని రైతులు, వ్యవసాయ కూలీలను కోరారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి


పరిసరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణీందర్

సిరికొండ: గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని డీఎల్‌పీవో ఫణీందర్ అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య పనులు పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సాగర్

ఇచ్చోడ: వర్షకాలంలో మలేరియా, డయేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ పీహెచ్‌సీ సాగర్ అన్నారు. సోమవారం మండలంలోని ముఖరా(కె)లో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో 57 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కలుషిత నీటిని తాగవద్దని సూచించారు. బోరుబావుల నీటినే తాగాలన్నారు. పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఎన్‌ఎం అహల్య, ఆశ వర్కర్ ఉన్నారు.

నార్నూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే వైద్య శిబిరాలు నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని ఏంపల్లి కొలంగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలో భాగంగా ప్రతీ సబ్‌సెంటర్ పరిధిలోని గ్రామాలను సందర్శించి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. హై రిస్క్ గ్రామాల్లో గర్భిణులను గుర్తించి ముందస్తు చర్యలో భాగంగా సంరక్షణ కేంద్రానికి తరలించాలని సూచించారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరందాస్, జవహర్ పాల్గొన్నారు.


వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలి

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన పటేల్ రమేశ్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్ ఉన్నారు. అదే విధంగా హైదరాబాద్‌లోని కుమురంభీం స్టడి సర్కిల్‌ను సందర్శించారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే బొజ్జన్న బువ్వ

ప్రతీ సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే గిరిజన దర్బార్‌కు వచ్చే నిరుపేద గిరిజనుల కోసం బొజ్జన్న బువ్వ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట అన్నదానం నిర్వహించారు. గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

పంటల బీమా అమలు చేయాలి

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమాను వెంటనే అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంటల బీమాను 2019 నుంచి అమలు చేయలేదని అన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంటలకు భీమాను అమలు చేస్తే, పంటలు నష్టపోయినప్పుడు రైతుకు ఆసరాగా ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి పంటల బీమాను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు శేఖర్ రెడ్డి, జంగు, మురళి, రాజేశ్వర్ రెడ్డి, మాన్కు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

మహిళ అదృశ్యం

ఎదులాపురం: పట్టణ టుటౌన్ పరిధిలోని విద్యానగర్‌కు చెందిన కుమారి లక్ష్మి (66) కనిపించకుండా పోయింది. హెడ్‌కానిస్టేబుల్ కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కుమారి లక్ష్మి సోమవారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం వరకు ఆమె కోసం గాలించిన కుటుంబసభ్యులు టుటౌన్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

ఇంద్రవెల్లి: అనారోగ్యంతో విద్యార్థి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కేస్లాగూడ (బి)గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కేస్లాగూడ గ్రామానికి చెందిన హెరేకుమ్ర ముయిబా, కీర్తనబాయి దంపతులకు చెందిన చిన్న కుమారుడు హెరేకుమ్ర సోనేరావ్(20) గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సోనేరావ్‌ను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఆదివారం ఒకసారిగా పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న సమయంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థి నాయకుడు..

బోథ్: మండల కేంద్రానికి చెందిన టీజీవీపీ విద్యార్థి నాయకుల అవునూరి శ్రీనివాస్ సోమవారం మృతి చెందాడు. గత కొంత కాలంగా శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఆయన మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.

ఆర్థిక సాయం

బోథ్: మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ ఇటీవల మృతి చెందడంతో ఆయన స్నేహితులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. ప్రవీణ్‌తో 2004- 05లో పదో తరగతి చదివిన స్నేహితులు తలాకొంత డబ్బులు జమ చేసి, ఆడెపు భవితపై రూ. 10 వేలు, ఆడెపు తరుణిపై రూ. 30 వేలను స్థానిక పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు.

రాథోడ్ రమేశ్ మృతి తీరని లోటు

ఇంద్రవెల్లి: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మృతి తీరని లోటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన హాజరై రాథోడ్ రమేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, రాథోడ్ భీంరావ్, మరప రాజు, రాథోడ్ రాధిక, కనక తుకారం, దిలీప్ మోరే, నిదాన్‌సింగ్, సంతోష్, దేవ్‌పూజే మారుతి పాల్గొన్నారు.

వర్షాకాలంలోనూ నీటిగోస

- 15 రోజులుగా నిలిచిన 'భగీరథ' నీరు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని అధికారులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనులకు ఏ కాలమైనా నీటి గోస తప్పడం లేదు. గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గిరిజన గ్రామాలకు చుక్క నీరు అందడం లేదు. దీంతో తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామాల్లో పని చేస్తున్న చేతిపంపుల వద్ద ఖాళీ బిందెలతో బారులు తీరుతున్నారు. చేతిపంపుల్లో కూడా నీరు ఇంకిపోవడంతో బిందె నిండేందుకు 20 నిమిషాల సమయం పడుతుంది. గాదిగూడ మండల కేంద్రంలో దాదాపు 300కు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నారు. దాదాపు 80 శాతం మంది మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడి ఉన్నారు. కుమురం భీం జిల్లా జైనూర్ మండలంలోని ధనోరా వాటర్ సంపు వద్ద సాంకేతిక సమస్య రావడంతో గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. నీటి సమస్య పరిష్కారం కోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా స్వయంగా ఆదేశాలు జారీచేసినా.. నీటి సరఫరా కావడం లేదు. దీంతో ఏమి చేయాలో తెలియక పంచాయతీ కార్యదర్శులు అయోమయానికి గురవుతున్నారు. తాగునీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాగునీటి వసతి కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.



చేతిపంపు వద్ద వేచి చూస్తున్న ప్రజలు

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని షీటీం సభ్యులు సుశీల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ ద్వారా సైబర్ క్రైం నేరాలు జరుగుతున్నాయన్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, సోషల్ మీడియా యాప్‌లలో ఎలాంటి పోస్టులు అప్‌లోడ్ చేయవద్దని సూచించారు. సైబర్ క్రైం జరిగినప్పుడు 1930కు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినులు ఇబ్బందులకు గురైతే 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు సత్యమోహన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

కొట్టుకుపోయిన కల్వర్టు


బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని కరోని(బి) గ్రామ శివారులోని కల్వర్టు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. కల్వర్టు సీసీ భాగం పూర్తిస్థాయిలో కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ఏమాత్రం అవకాశం లేకుండా ఉందని ఆదివాసీలు పేర్కొంటున్నారు.

ఎస్సై ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్టు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులను వెంటనే అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వమించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు అల్లూరి భూమన్న, నగేశ్, ప్రభుదాస్, పొచ్చన్న, ఊశన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అబేంద్కర్ సంఘాల జేఏసీ కన్వీనర్ శాంతపూర్వ రాజేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపిక

బోథ్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో సత్తా చాటారు. సొనాల గ్రామానికి చెందిన తుల అజయ్, మండల కేంద్రానికి చెందిన ఆర్.రంజిత్ కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సతీష్, పొచ్చెర గ్రామానికి చెందిన అల్లాడి రాకేశ్, ధన్నూర్(బి) గ్రామానికి చెందిన గొల్లపెల్లి రమేశ్‌లు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు ఎంపికయ్యారు. కాగా మెయిన్స్‌కు ఎంపికైన వారిని గ్రామస్తులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు

ఆదిలాబాద్‌టౌన్: మహిళ శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్, రణదీవెనగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. మెటర్నిటి బెన్‌ఫిట్స్, హెల్త్ న్యూట్రీషన్, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్త రాధ పాల్గొన్నారు.

నేడు దినసంతకు వేలం

ఇచ్చోడ: మేజర్ పంచాయతీ పరిధిలో దినసంతకు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. దినసంత వేలంలో పాల్గొనే వారు ఎస్టీ అయి ఉండాలన్నారు. రూ. 50 వేలు డీడీ రూపంలో పంచాయతీ కార్యాలయంలో చెల్లించాలని తెలిపారు.